

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దర్శనం కోసం ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయం ప్రాంగణం కిటకిటలాడింది. నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ముగిసి రెండు వారాలు అయినప్పటికీ భక్తుల తాకిడి తగ్గలేదు. బాలాలయంతో పాటు క్యూలైన్లు అన్ని భక్తులతో నిండిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు.. భక్తులకు మంచినీరు, మజ్జిగ అందజేశారు.

- అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి



బాలాలయంలో నూకాంబిక అమ్మవారు



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

మోదకొండమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభం



ఆలయంలో పూజలందుకుంటున్న మోదకొండమ్మ



ఆలయం నుంచి అమ్మవారి పాదాలు, ఉత్సవ విగ్రహం, తల్లిగరగతో శతకంపట్టుకు బయలుదేరుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పాడేరులో మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలోని ఉత్సవ విగ్రహం, పాదాలను శతకంపట్టులో కొలువుతీర్చే తంతుతో మూడు రోజుల ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ అభిషేక్‌గౌడ, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి.. అమ్మవారి పాదాలు, ఉత్సవ విగ్రహం, తల్లిగరగలను తలకెత్తుకుని ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఆలయం నుంచి భారీ ఊరేగింపుతో శతకం పట్టు వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. 13వ తేదీ సాయంత్రం వరకు ఇక్కడే పూజలు నిర్వహిస్తారు. మంగళవారం భారీగా ఊరేగింపుతో తిరిగి ఆలయానికి చేర్చుతారు.

తూకంలో మోసం

ఎలక్ట్రానిక్ కాటాల్లోనూ వినియోగదారులకు బురిడీ

- లీటర్ (ఎల్) మోడ్‌లో పెట్టి కిలో బరువుగా తూకం
- కిలోకు 90 గ్రాములు నష్టపోతున్న కొనుగోలుదారులు
- మాసం, చేపల దుకాణాలలో అధికంగా మోసాలు
- లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీల్లో బయటపడుతున్న అక్రమాలు



మాసం దుకాణంలో లీటర్ మోడ్‌లో ఉన్న ఎలక్ట్రానిక్ తూనిక యంత్రం మీద 5 కిలోల రాయి పెట్టగా 5.510 కిలోలు బరువు చూపిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి):

వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్న వారు తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలను ట్యాంపరింగ్ చేయించి, వినియోగదారులను దోపిడీ చేస్తున్నారు. వాస్తవ బరువుకన్నా పది శాతం తక్కువ వచ్చేలా కాటాలో సర్దుబాటు చేస్తున్నారు. కొన్నిచోట్ల రిమోట్ కంట్రోల్‌తో కాటాలను ఆపరేట్‌చేస్తూ తూకంలో అక్రమాలకు పాల్పడుతున్నారు. అధికారులు తనిఖీలు చేస్తే తప్ప ఇటువంటి మోసాలు బయటపడడంలేదు.

గతంలో త్రాసు కాటాలు వుండేవి. కొంతమంది వ్యాపారులు త్రాసు గొలుసుల్లో కొన్ని లింకులను తప్పించడం, త్రాసు కింద అయస్కాంతం ముక్క పెట్టడం, తూకం రాళ్లను అరగదీయడం వంటి పనుల ద్వారా వస్తువుల తూకం తగ్గేలా మోసాలకు పాల్పడేవారు. తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీల్లో ఈ అక్రమాలు బయటపడేవి. సంబంధిత వ్యాపారికి జరిమానా విధించి వదిలేశారు. త్రాసు కాటాల స్థానంలో ఎలక్ట్రానిక్ కాటాలు అందుబాటులోకి వచ్చాయి. వస్తువు ఎంత బరువు వుందో డిస్‌ప్లేలో కనిపిస్తుండడంతో తూకం కచ్చితంగా వుంటుందని వినియోగదారులు భావించారు. కానీ కాదేదీ మోసానికి అనర్హం అన్నట్టుగా.. ఎలక్ట్రానిక్ కాటాల్లో కూడా అక్రమాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా మాంసం, చేపలు, చికెన్ దుకాణాల్లో తూకంలో మోసాలు అధికంగా జరుగుతున్నట్టు తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీల్లో బయటపడుతున్నది. వాస్తవ బరువుకన్నా పది శాతం ఎక్కువ చూసేలా కాటా మెకానిజంలో మార్పులు చేస్తున్నట్టు గుర్తించారు. ఉదాహరణకు కిలో సరకును కాటా వేస్తే.. ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలో 1,100 గ్రాములు చూపిస్తుంది. ఈ లెక్కన కిలో సరకు కొంటే.. వినియోగదారులకు 900 గ్రాములే వస్తుంది.

మోసం ఎలా జరుగుతుందంటే...

దుకాణదారుడు ఎలక్ట్రానిక్ కాటాలో లీటర్ మోడ్(ఎల్)లో తూకం వేసి ఇస్తాడు. కొనుగోలుదారులు ... మిగతా 6వ పేజీలో



ఎలమంచిలిలో తూకంలో మోసాలకు పాల్పడుతున్న మాంసం దుకాణం నిర్వాహకులపై కేసు రాస్తున్న నర్సీపట్నం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనురాధ

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



మాంసం, చేపల విక్రయదారులు ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలతో మోసాలకు పాల్పడుతున్నట్టు గుర్తించాం. ఇటీవల ఎలమంచిలిలో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా.. కిలోకు 100 నుంచి 120 గ్రాములు తక్కువ వచ్చింది. దీంతో నాలుగు దుకాణాలపై కేసులు రాశాం. కాటాను లీటర్ మోడ్‌లో పెట్టి బరువు తుయ్యడం వల్ల కొనుగోలుదారులు నష్టపోతున్నారు. ఈ విషయంలో. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ఎలక్ట్రానిక్ కాటా కిలో మోడల్‌లో వుందో లేదో చెక్ చేసుకోవాలి.

అనురాధ, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్, నర్సీపట్నం

పోటాపోటీగా కబ్జాలు

'పేట' మెయిన్ రోడ్డులో నానాటికీ పెరిగిపోతున్న ఆక్రమణలు

- తొలుత బడ్డీలు ఏర్పాటు.. కొంతకాలం తరువాత పక్కా షెడ్లు నిర్మాణం
- హామీలకు పరిమితమైన రహదారి విస్తరణ
- వాహనాల రద్దీతో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య



మెయిన్‌రోడ్డును ఆక్రమించి నిర్మించిన షెడ్డు, పై అంతస్తుకు ఏర్పాటు చేసిన ఇనుప మెట్లు

పాయకరావు పేట, మే 11 (ఆంధ్రజ్యోతి):

స్థానిక మెయిన్ రోడ్డులో ఆక్రమణలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఒకరిని చూసి మరొకరు, పోటాపోటీగా ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి బడ్డీలు ఏర్పాటుచేస్తున్నారు. కొంతకాలం తరువాత బడ్డీల స్థానంలో పక్కా దుకాణాలు నిర్మిస్తున్నారు. 100 నుంచి 120 అడుగులు వెడల్పు వుండాల్సి రోడ్డు.. ఆక్రమణ కారణంగా సగానికిపైగా కుంచించుకుపోయింది. దీనివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నది. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వర్షం కురిస్తే మెయిన్ రోడ్డు జలమయం అవుతున్నది.

పాయకరావుపేటలో తాండవ జంక్షన్ నుంచి జాతీయ రహదారిపై వై జంక్షన్ వరకు మెయిన్ రోడ్డు సుమారు రెండున్నర కిల్లో మీటర్ల పొడవు వుంటుంది. పాయకరావుపేట, పక్కన వున్న తుని పట్టణంతోపాటు మండలాల్లోని ఇతర గ్రామాల ప్రజలు, వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా వుంటుంది. వాస్తవంగా మెయిన్ రోడ్డు 100 నుంచి 120 అడుగుల వెడల్పు వుంది. కానీ ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోతుండడంతో సగానికి తగ్గిపోయింది. ఆర్‌అండ్‌బీ స్థలంలో బడ్డీలు, షెడ్లు ఏర్పాటు చేస్తుండడం, మరోవైపు వాహనాల రద్దీ నానాటికీ పెరిగిపోతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. రోడ్డు విస్తరణ చేపడితే ఇటు ఆక్రమణల సమస్య, అటు ట్రాఫిక్ సమస్య తొలగుతాయని అధికారులు భావించి 2012లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, నిధులు మంజూరు చేసింది. అయితే స్థానిక రాజకీయ నేతల ఒత్తిళ్లు, ఇతర కారణాల వల్ల రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. అనంతరం ఆక్రమణలు మరింత పెరిగిపోయాయి. వాహనాల రద్దీ కూడా అధికమైంది. తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు 2018లో అప్పటి స్థానిక ఎమ్మెల్యే అయితన వంగలపూడి అనిత, వీఎంఆర్‌డీఏ నిధులతో మెయిన్‌రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టారు. అయితే మెయిన్‌రోడ్డు పక్కన స్థలాలు, భవనాలు వున్న కొంతమంది వర్తకులు కోర్టులో పిటిషన్ వేయడంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్ల తాత్సారంచేసి 2023 చివర్లో మెయిన్‌రోడ్డును విస్తరిస్తున్నట్టు ప్రకటించింది. అయితే రోడ్డును విస్తరించకుండా, అప్పటికే వున్న రోడ్డుపై గోతులు పూడ్చి, బీటీ లేయర్ వేయించి చేతులు దులుపుకుంది. గత ఏడాది ఎన్నికల అనంతరం కూటమి అధికారంలోకి రావడం, స్థానిక ఎమ్మెల్యే అయిన వంగలపూడి అనిత హోం మంత్రి కావడంతో పాయకరావుపేట మెయిన్ విస్తరణ కచ్చితంగా జరుగుతుందని పట్టణ ప్రజలు భావించారు. కానీ ఏడాది అవుతున్నప్పటికీ ఎటువంటి కదలిక లేదు. కనీసం ... మిగతా 6వ పేజీలో



పార్కు సెంటర్‌లో గతంలో ఏర్పాటు చేసిన బడ్డీల స్థానంలో ఇనుప రేకులతో నిర్మించిన షెడ్లు

రారెత్తించిన ఎండ

ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు

- ఎండవేడికితోడు వడగాడ్పులు
- నిర్మానుష్యంగా మారిన రహదారులు



చోడవరంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

(ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్)

జిల్లాలో ఎండ తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఆదివారం ఉదయం నుంచే వడగాడ్పులు వీశాయి. పది గంటల తరువాత రోడ్లపై జనసంచారం పూర్తిగా తగ్గిపోయింది. ఎండవేడికితోడు వడగాడ్పులు వీయడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడ్డారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వాతావరణం చాలా వేడిగా వుంది. గత వారం వర్షాలు పడడంతో కొద్ది రోజులపాటు చల్లబడిన వాతావారణం.. నాలుగు రోజుల నుంచి క్రమేపీ మారిపోయి ఎండ తీక్షణంగా కాస్తున్నది. ఆదివారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. దీనికితోడు గాలిలో తేమశాతం అధికంగా వుండడంతో ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. కాగా జిల్లాలో ఆదివారం వివిధ మండలాల్లో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలిలా వున్నాయి. నర్సీపట్నంలో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది., బుచ్చెయ్యపేటలో 40 డిగ్రీలు, మాడుగులలో 40, రావికమతంలో 39.7 అనకాపల్లిలో 39.6, గొలుగొండలో 39.5, రోలుగుంటలో 38.7, సబ్బవరంలో 38.4, కశింకోటలో 38.3, మాకవరపాలెంలో 38.3, చీడికాడలో 38.3, మునగపాకలో 38.2, దేవరాపల్లిలో 38, కె.కోటపాడులో 38, నాతవరంలో 37.9, చోడవరంలో 37.4, నక్కపల్లిలో 36.8, పరవాడలో 36.7, అచ్యుతాపురంలో 36.6, పాయకరావుపేటలో 36.2, రాంబిల్లిలో 35.8, కోటవురట్లలో 35.6, ఎస్.రాయవరంలో 35.6, ఎలమంచిలిలో 35.4 డిగ్రీలు నమోదయ్యాయి. వాతావరణ శాఖ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం జిలాల్లో సోమ, మంగళవారాల్లో ఎండ తీవ్రత మరింత పెరగనున్నది. సోమవారం చీడికాడ, కశింకోట, మునగపాక, పరవాడ, అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్ల, ఎస్.రాయవరం మినహా మిగిలిన మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైబడి నమోదయ్యే అవకాశం వుంది. మంగళవారం అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్ల, ఎస్.రాయవరం తప్ప మిగిలిన మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైబడి నమోదు కావచ్చు. నాతవరంలో అత్యధికంగా 43.5 డిగ్రీలు నమోదు అయ్యే అవకాశం వుందని వాతావరణ శాఖ వెల్లడించింది.

పెళ్లింట విషాదం

- క్వారీ గొయ్యిలో ఈతకు వెళ్లి నవ వరుడి మృతి
- పాత కొట్నాబిల్లిలో విషాదఛాయలు



ఈ నెల 8వ తేదీన వివాహ వేడుకలో జగదీశ్, ఉమా

రావికమతం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా ఓ నవ వరుడి ప్రాణాలు తీసింది. కాళ్లపారాణి ఆరకముందే నవ వధువుకు భర్తను శాశ్వతంగా దూరం చేసింది. మూడు రోజుల క్రితం పెళ్లి వేడుకలు జరిగిన ఆ ఇంట్లో తీవ్ర విషాదాన్ని నింపిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండలంలోని పాత కొట్నాబిల్లికి చెందిన ఆసరి సీతారావు, పైడితల్లిమ్మల ఏకైన కుమారుడు ఆసరి జగదీశ్(24)కు, ఇదే గ్రామానికి చెందిన ముసలి షైనేరు కుమార్తె ఉమా(20)తో ... మిగతా 6వ పేజీలో

ప్లాస్టిక్ భూతం

గ్రామాల్లో పెరిగిపోతున్న వ్యర్థాలు

- డ్రైనేజీల్లో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం
- పెరిగిపోతున్న దోమలబెడద
- ఖాళీ స్థలాలు, చెరువులు, పొలాల్లో సైతం పాలిథిన్ వ్యర్థాల సమస్య
- ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేయడంలో అధికారులు విఫలం



వాడచీపురుపల్లి సంతబయలు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు

పరవాడ, మే 11 (ఆంధ్రజ్యోతి):

నగరాలు, పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా ప్లాస్టిక్ సమస్య నానాటికీ తీవ్రతరం అవుతున్నది. ఇది పర్యావరణానికే కాకుండా మనుషులకు, పశువులకు ప్రాణాంతకంగా మారింది. గ్రామాల్లో పారిశుధ్య సమస్య పెరిగిపోతున్నది. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి, మురుగునీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో సైతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. గ్రామ పంచాయతీలకు ఇదో పెద్ద సమస్యగా తయారైంది. కాలువల నిర్వహణ సరిగా లేక, పూడికతీత పనులు చేపట్టక దుర్వాసన, దోమలతో ప్రజలు ఇబ్బందిపడుతుండగా.. ప్లాస్టిక్ సమస్య మరింత జటిలం చేస్తున్నది. గ్రామాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, వీటి నిర్వహణ కోసం తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ పై విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మండలంలోని అన్ని గ్రామాల్లో సాధారణ చెత్త కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా ఉంటున్నాయి. పర్యావరణ పరిరక్షణపై పదే పదే అవగాహన కల్పిస్తున్నా, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ... మిగతా 6వ పేజీలో



పరవాడ జగన్నాథంవీధికి సమీపంలో రహదారి పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు

దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్ విడుదల

అచ్యుతాపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, రైతుల సమస్యలపై ఈనెల 20 జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము కోరారు. దీనికి సంబంధించిన గోడపత్రికను ఆయన ఆదివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కె.సోమునాయుడు, ఆటో కార్మిక సంఘ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం రూరల్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, సోమునాయుడులు కోరారు...ఆదివారం అచ్యుతాపురంలో వీరు పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఎఈజడ్ కార్మికులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా పాఠశాల భవనం


అప్పన్నపాలెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనం

రాంబిల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరపూడి పంచాయతీ అప్పన్నపాలెంలోని అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవనానిన త్వరితంగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాల భవనం నిర్మాణం చేపట్టారు. గత రెండేళ్లుగా పట్టించుకోకుండా వదిలేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. పాఠశాల భవనం నిర్మాణం చేపట్టిన అధికారులు పూర్తిచేయకుండా వదిలేయడంతో చిన్నారులు ఇబ్బంది ఎదుర్కొంటున్న తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు జనవాణి కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు అర్జీని అందజేశారు. ఇకనైనా పాఠశాల భవనం పూర్తికి చర్యలు తీసుకోవాలని అప్పన్నపాలెం గ్రామప్రజలు కోరుతున్నారు.

అమ్మ గొప్పతనం వర్ణనాతీతం


వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

పాయకరావుపేట, మే 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం మాతృ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు అమ్మ గొప్పతనంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకుడు ఎన్‌టీ సీతారామమూర్తి మాట్లాడుతూ చిన్నారులకు తొలి గురువని అమ్మ అని, ఆమెను ప్రతి ఒక్కరు గౌరవించాలని అన్నారు. విలువలు, అమ్మ గొప్పతనం తదితర అంశాలపై వివరించారు. యో గా గురువు రాజు విద్యార్థులకు యోగా సాధన, వై.అచ్యుతరావు భగవద్గీత శ్లోకాలు చిన్నారులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం


పూజలందుకున్న అభయాంజనేయ స్వామి

ఎస్. రాయవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెడ్డపాలెంలో అభయాంజనేయ స్వామి 18వ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ


సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు

చేపట్టారు. సాయంత్రం వీధుల్లో మహిళల కోలాట ప్రదర్శన మధ్య అభయాంజనేయ ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

రేబాక అమ్మవారి ఆలయం కిటకిట

నక్కపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి ఆలయం ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పసుపు,కుంకుమలు సమర్పించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. పలువురు భక్తులు ఆలయ పరిసరాల్లో వంటలు చేసుకుని కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి సందడి చేశారు.

పుస్తక పఠనం అలవరుచుకోవాలి



పుస్తక సమీక్షపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ అధికారి

నక్కపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి పుస్తక పఠనపై ఆసక్తి పెంపొందించుకోవాలని మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయాధికారి కె.జనార్దన్ అనారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పుస్తక సమీక్షపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయంలోఉన్న పలు అంశాలకు చెందిన పుస్తకాలను విద్యార్థులకు అందజేసి అందులో వున్న సారాంశం, పుస్తక రచయితల పేర్లు గుర్తించడంపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి రోజూ పుస్తకం చదవడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.


పెద్దూరులో ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు


కుళాయిల వద్ద ఖాళీ బిందెలు

పెద్దూరులో దాహం కేకలు

- గుక్కెడు నీటికి గ్రామస్థుల అగచాట్లు
- అక్రమ కుళాయి కనెక్షన్లతో సమస్య
- పట్టించుకోని అధికారులు

పాయకరావుపేట రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురం గ్రామ పంచాయతీ శివారు పెద్దూరు (రత్నయ్యమ్మపేట)లో గుక్కెడు తాగునీటికి సైతం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని నెలలుగా కుళాయిలనుంచి నీరు రావడం లేదని గ్రామానికి చెందిన పాలిక కుమారి, రాయుడు భవాని, రాయుడు పోలమ్మ, దారా నల్లమ్మ, పాలిక భూదేవి, కోశెట్టి రత్నం, కోశెట్టి భవాని, కుప్పా వెంకటలక్ష్మి, బత్తిన మాసారమ్మ, దారా పంపమ్మ, పాలిక జ్యోతి, గుబ్బల గోవిందమ్మ, తదితరులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో సుమారు 2 వేల జనాభా నివసిస్తున్నారు. మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న రాజగోపాలపురం నుంచి పైపులైన్ ద్వారా కుమారపురంలోని వాటర్ ట్యాంకులోకి నీరు చేరుతుంది. అక్కడ నుంచి పెద్దూరుకు పైపులైన్ ద్వారా మినీ ట్యాంకులనుంచి నీరు సరఫరా అవుతుంది. కుమారపురంనుంచి వస్తున్న పైపులైన్‌నుంచి నీరు మధ్యలో కొంతమంది అ క్రమ కుళాయి కనెక్షన్లతో దారి మళ్లిస్తున్నారు. దీంతో పెద్దూరుకు నీరు చేరడం లేదని, దీంతో చాలా నెలలుగా కుళాయిలు పనిచేయడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమస్య పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడంలేదని స్థానిక వైస్ సర్పంచ్ ప్రసాద్ ఆరోపిస్తున్నారు. కుళాయిలు రాకపోవడంతో గ్రామంలో కొంతమంది ఇళ్ల వద్ద ఉన్న మోటార్ల ద్వారా నీటిని వాడుకుంటున్నామని, ప్రస్తుతం కాస్తున్న వేసవి కావడంతో ఎండలకు సరిగా వాటినుంచి నీరు రావడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు దీంతో తాగడానికి నీరు అందని పరిస్థితి నెలకొన్నట్టు తెలిపారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మించినా ఇంకా వినియోగంలోకి రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి తాగునీటిని అందించాలని కోరుతున్నారు.

కొన్ని నెలలుగా కొళాయిలు పనిచేయడం లేదు

-దారా నల్లమ్మ, పెద్దూరు



గ్రామంలోకి కొన్ని నెలలుగా కుళాయి నీరే రావడం లేదు. ఇంతవరకు మోటారు ఉన్న ఇంటి వద్ద నుంచి నీరు తెచ్చుకున్నాం. ఇపుడు అక్కడ కూడా రావడం లేదు. తాగడానికి గుక్కెడు మంచినీరు లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. మంచినీరు లేక చచ్చిపోయేలా ఉన్నాం. అధికారులు స్పందించి ఇప్పటికైనా తాగునీటిని సరఫరా చేయాలి.

టైలర్ల సంక్షేమానికి సమష్టి కృషి

- న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ


అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణను అభినందిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఎలమంచిలి, మే 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టైలర్ల సంక్షేమానికి సమష్టి కృషి చేస్తామని న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అతికినిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని పీవీ కాంప్లెక్సు ఆవరణలో ఇటీవల కర్నూల్ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గంలో ఉమ్మడి జిల్లాలో బాధ్యతలు చేపట్టిన ప్రతినిధులతో ఈ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ టైలరింగ్ వృత్తి పై జీవనంసాగిస్తున్న వారంతా నూతన పోకడలను అందిపుచ్చుకోవాలన్నారు. రెడీమేడ్ రంగం ప్రవేశంతో దర్జీల పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సంఘ రా ష్ట్ర కోశాధికారిగా నియమితులైన ఎలమంచిలి టైలర్స్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు వియ్యపు సత్యనారాయణను సభ్యులు సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయ సలహాదారులు టి.పుల్లయ్యనాయుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాస్కరరావు, సహాయ కార్యదర్శి ఇ. త్రినాద్, సభ్యులు రసూల్, అద్దేపల్లి సత్యనారాయణ, డి.సూరిబాబు, మళ్ల శ్రీను, డి.శేషబాబు, కె. సత్యనారాయణ, గిడుతూరి అప్పారావులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

అచ్యుతాపురం/అచ్యుతాపురం రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): బ్రాన్‌డిక్స్ ఇండియా అపెరల్ సిటీ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఆదివారం కంపెనీ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి 650 మంది రోగులకు హాజరుకాగా.. వైద్య నిపుణులు 405 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 295 మందికి ఉచిత కళ్లద్దాలు అందించారు. 86 మందికి మందులను అందజేశారు. 55 మందికి కేటరాక్స్ సర్జరీకి సూచించారు.ఈ సందర్భంగా బ్రాన్‌డిక్స్ ఇండియా అపెరల్ సిటి ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ.. స్థానికుల ఆరోగ్య సంరక్షణ కోసం శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

తల్లిదండ్రుల ఆరాధనను మించిన సేవ లేదు

- వేంకటేశ్వర గీతా ప్రచార కన్వీనర్ శరగడం పరదేశినాయుడు


మాతృ దినోత్సవంలో మాట్లాడుతున్న పరదేశినాయుడు

మునగపాక, మే 11 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సేవకు మించినది మరోకటి లేదని శ్రీవేంకటేశ్వర గీతా ప్రచార కన్వీనర్ శరగడం పరదేశినాయుడు పేర్కొన్నారు. స్థానిక పంక్షన్ హాలులో ఆదివారం మాతృ దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగిగా తన విధులు నిర్వహిస్తూనే మరోవైపు ఉమ్మడి కుటుంబ వ్యవస్థను పదిలం చేసుకున్నానన్నారు.తర్వాత భగవద్గీత పఠనంపై ప్రచారం సాగిస్తున్నట్టు చెప్పారు. వృద్ధ దంపతులకు సన్మానం చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొడ్డేడ ప్రసాద్, కాండ్రేగుల జగ్గారావు, మొల్లేటి సత్యనారాయణ, ఆడారి గణపతి అచ్చింనాయుడు, ఆడారి కాశిబాబు, దొడ్డి వెంకటరమణ, పంచాయతీరాజ్ ఉద్యోగులు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

మునగపాక, మే 11 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల విశిష్టతను తెలియజేయడం లక్ష్యంగా పిల్లలకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు ఆళ్ల మహేశ్వరరావు తెలిపారు. మండలంలో గవర్ల అనకాపల్లి నెహ్రూ యూత్ క్లబ్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం అనకాపల్లి చిల్డ్రన్ క్లబ్ సౌజన్యంతో ప్రత్యేక శిక్షణ తరగతులు జరిగాయి. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అ నకాపల్లి చిల్డ్రన్ క్లబ్‌కు చెందిన పలువురు సభ్యులు ఐదు రోజులుగా సేవలను అందించారన్నారు. పిల్లలకు ఆసక్తి కలిగించే అంశాలను బోధించారని చెప్పారు. ఉపాధ్యాయుడు పొలమరశెట్టి చంద్రారావు దేశభక్తి గీతాలపై శిక్షణ ఇచ్చారు. మ్యాజిక్ షో పిల్లలను అమితంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సిహెచ్.రామలక్ష్మి, బి.ఉమామహేశ్వరరావుపాల్గొన్నారు.


పిల్లలకు దేశభక్తి గీతాలపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో గురువులతోపాటు పూర్వ విద్యార్థులు

ఎస్. రాయవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా 20 ఏళ్ల తరువాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి వరకు పాఠాలు చెప్పిన తమ గురువుల చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులంతా ఒకరికి నొకరు క్షేమ సమాచారం తెలుసుకున్నారు. గురువులు ఉద్దండం రాజేశ్వరరావు, ఎం వెంకయ్య (బాబూరావు), వి. కొండలరావు, ఆర్. మోహనరావు, ఎస్. శ్రీనివాసరావు, ఎం. సత్యనారాయణ, ఎస్. కల్యాణరావు, ఎల్ . ఎస్. నాయుడులను వేదికపైకి స్వాగతం పలికి వారికి పాదపూజ చేసి ఆశీర్వాదం పొందారు. వారిని సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమను ఆహ్వానించి సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసున్నారు. ఆట, పాటలతో సందడిగా గడిపారు, మధ్యాహ్నం ఉపాధ్యాయులతో పాటు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కీర్తి మాధవ్, నూకరాజు, మట్టా గోపి, సంతోష్, సోమిరెడ్డి నారాయణమూర్తి, పేపకాయల నానాజీ, నున్న మానస, దాసరి ప్రభ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా తాండవ నది

- పేరుకుపోతున్న కొబ్బరి బొండాలు, వ్యర్థాలు..నీరు కలుషితం


సత్యవరం తాండవ నది బ్రిడ్జి వద్ద ఖాళీ కొబ్బరి బొండాలు, వ్యర్థాలు

పాయకరావుపేట రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం సమీపంలో తాండవ నది వంతెన వద్ద ఖాళీ కొబ్బరి బొండాలు, చెత్తతో వేస్తూ కప్పేస్తున్నారు. ఈ వ్యర్థాలతో నదిలో నీరు కలుషితం కావడమే కాకుండా బ్రిడ్జి స్తంభాల వద్ద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నట్టు రైతులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తు ని తదితర ప్రాంతాలలో విక్రయించిన త ర్వాత ఖాళీ కొబ్బరి బొండాలను సత్యవరం బ్రిడ్జి వద్ద తాండవ నదిలో వేస్తున్నారు. చుట్టు ప్రక్కల చెత్త చెదారాలను తీసుకువచ్చి వేస్తున్నారన్నారు. దీనివల్ల వర్షాలు ఎక్కువ పడే సమయాలలో నదిలో నీటి ప్రవాహం ఈ వ్యర్థాలతో ముందుకు సాగడంలేదు. ఇకనైనా నదిలో ఎటువంటి చె త్తా, చెదారాలు, కొబ్బరి బొండాలు వేయకుండా అధికారు లు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

ఎలమంచిలి, మే 11 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 20 వ తేదీన జరగనున్న కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ కోరారు. ఆదివారం స్థానిక భవన నిర్మాణ కార్మికులతో కలిసి కరపత్రాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, 1214 మెమోను రద్దుచేసి కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల నిర్మాణానికి రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు శంకరరావు, అప్పారావు, వేగి అప్పలరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని విద్యుత్ స్తంభాలు ధ్వంసం

మునగపాక, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ రోడ్డు శ్మశాన వాటికకు సమీపంలో ట్రాక్టర్ ఢీ కొని నాలుగు విద్యుత్ స్తంభాలు ధ్వంసమైనట్టు స్థానిక ట్రాన్స్‌కో ఏఈ జగదీశ్ తెలిపారు. ఆదివారం ఈ విషయాన్ని తెలుసుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. ట్రాక్టర్ నంబర్ ఆధారంగా ఆ యజమానిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. విద్యుత్ పునరుద్ధరణ పనులను వెను వెంటనే మొదలు పెట్టామన్నారు. ఈ సంఘటనలో ఎటు వంటి ప్రాణహాని జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

తూకంలో మోసం

... 5వ పేజీ తరువాయి

తూనిక యంత్రం డిస్‌ప్లే మీద బరువు చూసుకుని డబ్బులు ఇస్తుంటారు. వ్యాపారి లీటర్ మోడ్‌లో తూకం వేసి, కిలోల బరువు కింద కొనుగోలుదారుల నుంచి డబ్బులు తీసుకుంటున్నాడు. ఒక లీటరుకి 910 గ్రాములు వస్తుంది. కిలోకి 1,000 గ్రాములు. లీటర్ మోడ్‌లో తూకం వేసి ఇవ్వడం వల్ల కొనుగోలుదారుడు 90 గ్రాములు నష్ట పోతున్నాడు. మరికొందరు వ్యాపారులు కిలోకు 100 నుంచి 150 గ్రాములు తూకం తక్కువ వచ్చే విధంగా మిషన్‌లో సెట్టింగ్స్ మార్చుకుంటున్నట్టు లీగల్ మెట్రాలజీ అధికారులు గమనించారు. ఎలమంచిలిలో ఈ విధమైన మోసాలకు పాల్పడుతున్న మాంసం దుకాణాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు కేసులు రాశారు.

కొనుగోలుదారులు ఏం చేయాలంటే..

- ఎలక్ట్రానిక్ తూనిక యంత్రం మీద సరకులు తూకం వేసే ముందు లీటర్ (ఎల్) మోడ్‌లో ఉందేమో గమనించాలి. లీటర్ మోడ్‌లో ఉంటే మోడ్ బటన్ నొక్కమని వ్యాపారిని అడగాలి.
- ఎలక్ట్రానిక్ కాటా మీద బేసిన్ లేదా ట్రే పెట్టిన తర్వాత టేర్ బటన్ నొక్కి సున్నా చూపించమని అడగాలి.
- ఎలక్ట్రానిక్ కాటా మీద అనుమానం వస్తే.. లీగల్ మెట్రాలజీ అధికారులు ముద్ర వేసిన తూకం రాయితో బరువు చూపించమని అడగాలి.
- తూనిక యంత్రానికి లీగల్ మెట్రాలజీ అధికారులు ముద్ర వేసిన వైర్ కట్టి ఉందో లేదో చూడాలి
- కేంద్ర ప్రభుత్వం (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) ఆమోదించిన ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలు మాత్రమే వాడాలి. చైనా తూనిక యంత్రాల వినియోగం నిషేధం.

పోటాపోటీగా కబ్జాలు

... 5వ పేజీ తరువాయి

మెయిన్ రోడ్డు విస్తరణ గురించి ఒక్కసారి కూడా ప్రకటన చేయలేదు. దీంతో కబ్జాదారులు మరింత రెచ్చిపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి గతంలో బడ్డీలు ఏర్పాటు చేసిన వారు.. వాటిస్థానంలో ఇనుప రేకులతో పక్కాషెడ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. స్థానిక డీసీసీబీ బ్రాంచి సమీపంలో కొత్తగా షాపు నిర్మించిన యజమాని.. ఎదురుగా పది అడుగులు మేర రోడ్డును ఆక్రమించి షెడ్డు నిర్మించారు. అంతేకాక పైఅంతస్తుకు ఐరన్ మెట్లను ఏర్పాటుచేశారు. పాయకరావుపేట మెయిన్ రోడ్డులో ఆక్రమణలపై ఆర్‌అండ్‌బీ ఏఈ జ్ఞానేశ్వరరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. గతంలో ఈ రోడ్డును అభివృద్ధి చేయడానికి వీఎంఆర్‌డీఏకు బదలాయించారని, ప్రస్తుతం తమ ఆధీనంలో లేదని చెప్పారు.

ప్లాస్టిక్ భూతం

... 5వ పేజీ తరువాయి

పేరుతో ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నా.. ప్రజల్లో మార్పు కనిపించడం లేదని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లతో పేరుకుపోయి మురుగునీరు పారడంలేదు.

పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగం

ప్లాస్టిక్ వ్యర్థాలు నివాస ప్రాంతాల్లోనే కాకుండా ఖాళీ స్థలాలు, పంట పొలాలు, సాగునీటి చెరువుల్లో కూడా పేరుకుపోతున్నాయి. పరవాడ పెదచెరువుకు ఆనుకొని ఉన్న పైడిమాంబ బంధ, కోనాం, తానాంలోని బంధ, పరవాడ ఎర్రకోనాం తదితర చెరువులు ప్లాస్టిక్ వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వల్ల వాటిల్లోని నీటితోపాటు భూగర్భ జలాలు విషపూరితం అవుతున్నాయి. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోతున్నది. శుభకార్యాలు జరిగితే తాగునీటి నుంచి భోజనాల వరకు అన్నింటికీ ప్లాస్టిక్ వస్తువులే వాడుతున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ పేపర్ ప్లేట్లు ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. రహదారులపై చెత్తను తొలగించే పారిశుధ్య కార్మికులు డ్రైనేజీల కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడంలేదు. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు.

ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలను అరికడతాం

-కె.ధర్మారావు, పంచాయతీ విస్తరణాధికారి

దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలను అరికడతాం. వీటి వినియోగం వల్ల కలిగే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇళ్లలో వినియోగించే ప్లాస్టిక్ వ్యర్థాలను మురుగు కాలువల్లో వేస్తే చర్యలు తీసుకుంటాం. ప్లాస్టిక్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. ప్లాస్టిక్ వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలి.

పెళ్లింట విషాదం

... 5వ పేజీ తరువాయి

ఈనెల 8వ తేదీ రాత్రి గిరిజన సంప్రదాయాలతో వివాహం జరిగింది. మరుసటి రోజు శుక్రవారం అన్నవరం సత్యదేవుని సన్నిధిలో వ్రతం చేయించుకుని, దైవ దర్శనం చేసుకున్నారు. అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి చేరుకున్నారు. జగదీశ్ తన స్నేహితులకు పెళ్లి పార్టీ ఇచ్చేందుకు శనివారం మధ్యాహ్నం ఐదుగురు స్నేహితులతో కలిసి కొత్త కొట్నాబిల్లి వద్ద ఉన్న ఒక క్వారీ వద్దకు వెళ్లారు. పూటుగా మద్యం సేవించిన తరువాత జగదీశ్ సమీపంలో వున్న నీటి కుంటలో ఈత కొట్టడానికి వెళ్లాడు(క్వారీలో రాయి తవ్వకాల వల్ల ఇక్కడ భారీ గొయ్యి ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది). కానీ లోతు ఎక్కువగా వుండడంతో నీటిలో మునిగిపోయాడు. దూరంగా వున్న స్నేహితులు ఈ విషయాన్ని గమనించలేదు. జగదీశ్ తమకు చెప్పకుండా ఇంటికి వెళ్లిపోయి వుంటాడని భావించి ఊళ్లోకి వెళ్లిపోయారు. చీకటి పడినా జగదీశ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, అతని స్నేహితులను వాకబు చేశారు. క్వారీ వద్ద మద్యం సేవించామని, తమకన్నాముందే జగదీశ్ వచ్చేశాడని చెప్పడంతో అక్కడకు వెళ్లి వెతికారు. కానీ ఆచూకీ లభించలేదు. సమీప గ్రామాల్లో వున్న బంధువులను ఆరా తీసినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు మొదలుపెట్టారు. మధ్యాహ్నం తరువాత క్వారీ గొయ్యిలో జగదీశ్ శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు క్వారీ వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. జగదీశ్ తండ్రి ఆసరి సీతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం. రఘువర్మ తెలిపారు.



నిర్మానుష్యంగా ఉన్న మాడుగుల ఘాట్ రోడ్డు జంక్షన్

రారెత్తిస్తున్న ఎండలు

చోడవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నాలుగు రోజులుగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్న ఎండ భీకరంగా కాసింది. ఉదయం నుంచే వేడి తీవ్రంగా ఉండడంతో రహదారులపై జనసంచారం తగ్గిపోయింది. చాలా మంది ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడిపోయారు. ఎండ తీవ్రతతో పాటు గాలి లేకపోవడంతో భరించలేని ఉక్కబోతతో జనం అల్లాడుతున్నారు. రాత్రి సమయంలో సైతం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటుండడంతో వాతావరణం ఎప్పుడు చల్లబడుతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

మాడుగులలో...

మాడుగుల రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. భానుడు ఠారెత్తించడంతో వేడిమికి జనాలు తట్టుకోలేక బయటకు వచ్చేందుకు భయపడిపోతున్నారు. మధ్యాహ్న సమయాల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుండడంతో ఉక్కబోతకు ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. అరు బయటకు వెళ్లేందుకు భయపడి ఇళ్లకే పరిమితమవుతున్నారు. దీంతో జన సంచారం లేక రహదారులు, కూడళ్ల నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి.

స్పీకర్‌ను కలిసిన విశాఖ నగర మేయర్



స్పీకర్ దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న మేయర్ శ్రీనివాసరావు కుటుంబీకులు

నర్సీపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ మేయర్ పీలా శ్రీనివాసరావు స్పీకర్ అయ్యన్నపాత్రుడును ఆదివారం మర్యాదపూర్వంగా కలిశారు. నర్సీపట్నంలోని క్యాంప్ కార్యాలయంలో శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా స్పీకర్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్పీకర్ అభినందనలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందివ్వడంలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

మాడుగుల రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అవురువాడ గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో ఆదివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని, ఇలాంటి కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుప్పాల అప్పలరాజు, అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, మైచర్ల సన్యాసిరావు, చక్రవర్తిరాజు, మజ్జి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ సతీశ్‌కు ఘన సత్కారం



ఎన్ఆర్ఐ సతీశ్‌ను సన్మానిస్తున్న నందమూరి రామకృష్ణ, పట్టాభి

నాతవరం, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నాతవరానికి చెందిన టీడీపీ నాయకుడు, ఎన్ఆర్ఐ శెట్టి సతీశ్‌ను మాజీ సీఎం ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, టీడీపీ నేత పట్టాభి తదితరులు సన్మానించారు. బహ్రెయిన్‌లో ఆదివారం జరిగిన టీడీపీ మహానాడు (2025) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనార్దన్ రాకేశ్, బండారు వంశీ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బత్తుల తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బీపీ.అగ్రహారం, బంగారుమెట్ట గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఏపీ రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మెడికల్ క్యాంపు నిర్వాహకులను అభినందించారు. ఈ శిబిరంలో ఉచిత క్యాన్సర్, కంటి పరీక్షలు, సర్జరీలు, జనరల్, కార్డియాలజీ, డెర్మటాలజీ, కాస్మోటాలజీ, ఆర్థోపెడిక్, యూరనరీ, స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్ కోసం 15 మందిని వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించారు. 35 మందికి ఈసీజీలు చేశారు. హార్ట్‌ప్రాబ్లం ఉన్న ఏడుగురు వ్యక్తులను టుడే ఈకో పరీక్షల కోసం విశాఖ మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు జి.భాగ్యరాజు, కంటి వైద్య నిపుణులు ఎంఎల్ఎస్.రాజు, మార్కెటింగ్ హెడ్ మురళీ, జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, సర్పంచ్ మొల్లి శ్రీను, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దొండా శ్రీను, నాయకులు ఇళ్లపు జగ్గారావు, దొండా నరేశ్ పాల్గొన్నారు.

వ్యాధి లక్షణాలపై పూర్తి అవగాహన అవసరం

- సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ సమావేశంలో వక్తలు

కొత్తూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): వ్యాధి లక్షణాలపై గ్రామీణ వైద్యులంతా పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే సమయానికి తగిన వైద్యం అందించగలరని ప్రముఖ వైద్యులు ఆర్.పవన్‌కుమార్, కె.తిరుపతిరావు, టి.సురేష్‌బాబు అన్నారు. ఆదివారం అనకాపల్లిలో సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హార్ట్ ఎటాక్, ఫిట్స్, గ్యాస్ట్రిక్ తదితర వ్యాధుల లక్షణాలపై గ్రామీణ వైద్యులకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు గుర్తించి తగిన చికిత్స అందిస్తే యాభై శాతం మరణాలను తగ్గించవచ్చునని వారు సూచించారు.

పారిశుధ్య లోపం.. రోగాల భయం!

జి.కోడూరు గ్రామంలో పారిశుధ్యం లోపించింది. నెల రోజులుగా పరిస్థితి దయనీయంగా తయారైంది. రహదారులపైనే చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. ఏకంగా గ్రామ సచివాలయం.. ఆలయం.. విద్యాలయం.. చెంతనే చెత్తాచెదారం తాండవిస్తోంది. అయినప్పటికీ పట్టించుకునే నాథులే లేకపోవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా జనాలను రోగాల భయం వెంటాడుతోంది.

జి.కోడూరులో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనం

- రహదారి, పాఠశాల, ఆలయం, గ్రామ సచివాలయాల చెంతనే పేరుకుపోయిన చెత్తాచెదారం
- పందులు, దోమల స్వైరవిహారం.. భరించలేని దుర్వాసన
- వ్యాధుల భయంతో వణుకుతున్న ప్రజలు
- ఫిర్యాదు చేసినా పట్టని అధికారులు, పాలకులు

మాకవరపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.కోడూరు గ్రామంలో కొన్ని రోజులుగా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడం లేదు. దీంతో రహదారులు, సచివాలయం, ఆలయం, ప్రభుత్వ పాఠశాలకు ఆనుకుని చెత్త కుప్పలు పేరకుపోయాయి.





జి.కోడూరు రహదారికి ఆనుకుని గుట్టలుగా ఉన్న చెత్త కుప్పలు

ఓ పక్క అధికారులు ప్రతీ శనివారం స్వచ్ఛాంధ్ర అంటూ ఊదరగొట్టి ఉపన్యాసాలు ఇస్తున్నా, గ్రామాల్లో అందుకు తగిన చర్యలు ఎక్కడా కానరావడం లేదు. దీంతో ఎక్కడా చూసినా చెత్త కుప్పలు పెరిగిపోవడంతో దోమల బెడద ఎక్కువవుతోంది. దీనికితోడు వర్షాలకు చెత్తకుప్పలు తడిచిపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నది. ఇప్పటికే చెత్త పూర్తిగా కుళ్లిపోయిందని, దానిపై పందులు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, ఫలితంగా ఎప్పుడు ఏ రోగం ప్రబలుతుందోనని భయం వెంటాడుతున్నదని ప్రజలు వాపోతున్నారు.



సంతోషిమాత ఆలయం పక్కనే పేరుకుపోయిన చెత్త కుప్పలు

అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయంతో పాటు సంతోషిమాత గుడి వద్ద చెత్త పెరిగిపోయినా అధికారుల్లో చలనం లేకపోవడం దారుణమని వాపోయారు. దీంతో స్థానకంగా నివాసం ఉండలేకపోతున్నదని మండిపడుతున్నారు. చెత్త కంపు, దోమలు, పందుల స్వైరవిహారం వల్ల గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే చెత్తను తొలగించాలని, గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని, రోగాల బారిన పడకుండా తగిన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఎండీని మార్చండి

- సమర్థుడైన అధికారిని నియమించి ఫ్యాక్టరీని గాడిలో పెట్టండి
- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు బీజేపీ, సీపీఐ నేతల వినతి

చోడవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ నష్టాలకు బాధ్యులైన ఫ్యాక్టరీ ఎండీని తక్షణమే విధుల నుంచి తప్పించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఏఆర్‌జీ శర్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం రాత్రి కలిసి విజ్ఞప్తి చేశారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మనుగడ కొనసాగించే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఎండీని తప్పించి సమర్థుడైన అధికారిని నియమించడంతో పాటు ఫ్యాక్టరీని నడిపించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గత సీజన్‌లో ఫ్యాక్టరీ నష్టాలకు పూర్తిగా బాధ్యత ప్రస్తుత ఎండీదేనని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. గోవాడ ఫ్యాక్టరీకి ఎండీగా ఐఏఎస్ అధికారిని నియమించేలా చూస్తామని గతంలో ఎమ్మెల్యే రాజు ప్రకటించారని, ఈ మేరకు ఐఏఎస్ లేదా అటువంటి సమర్థత కలిగి ఫ్యాక్టరీపై అనుభవం ఉన్న అధికారిని నియమించాలని విన్నవించారు.

చెరకు రైతులను ఆదుకోవడానికి గోవాడలో డిస్టిలరీ లేదా ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేసే ముందు, మూడేళ్ల పాటు స్థిరంగా ఫ్యాక్టరీ సజావుగా నడిచేలా చూసి, ఆపై డిస్టిలరీ లేదా ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే రైతులకు ఫ్యాక్టరీకి ప్రయోజనకరంగా ఉంటుందని ఎమ్మెల్యేకు వారు తెలిపారు. అలాగే కార్మికుల జీతభత్యాలను చెల్లించాలని, వారిలో మనోస్థైర్యాన్ని నింపాలని ఆయన సూచించారు. ఫ్యాక్టరీ ఓవర్‌హాలింగ్ పనులు వెంటనే ప్రారంభించేలా చూడడంతో పాటు వచ్చే సీజన్‌కు ఫ్యాక్టరీని సిద్ధం చేయాలని, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ సహకారంతో గోవాడ అభివృద్ధికి రూ.వంద కోట్లు తీసుకువచ్చి గోవాడకు పూర్వ వైభవం తీసుకురావాలని వారు విన్నవించారు.



ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ, సీపీఐ నాయకులు

మంచం పట్టిన పెదగరువు

- జ్వరాలతో అల్లాడుతున్న గిరిజనులు
- వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వేడుకోలు

రోలుగుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ల పంచాయతీ శివారు గిరిజన గ్రామం పెదగరువులో జ్వరాలు ప్రబలాయి. వారం రోజులుగా తీవ్ర జ్వరాలతో పలువురు మంచం పట్టారు. గ్రామానికి చెందిన కిల్లో ప్రేమ్‌కుమార్ (8), కిల్లో పవులు (2), కిల్లో అక్ష (4), సీదరి రాణి (4)తో పాటు మరో ఐదుగురు చిన్నారులు, నలుగురు పెద్దలు తీవ్ర జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో కనీసం ఆశా, ఆరోగ్య కార్యకర్తలు లేకపోవడంతో వీరికి వైద్య సేవలు అందడం లేదు. దీంతో మంచాన పడి మూలుగుతున్నారు. బుచ్చెంపేట ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సమస్య తెలిపినా నేటికీ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

వైద్యం చేయించుకోవడానికి ఆరోగ్య కేంద్రానికి రావాలంటే సుమారు పది కిలోమీటర్లు కొండ దిగి, మరో 10 కిలోమీటర్లు వాహనంలో వెళ్లి చేయించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు.



జ్వరాలతో మంచంపట్టిన చిన్నారులు



ప్రైవేటు వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేక మంచం పట్టామని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గిరిజన సంఘ నాయకులు కిల్లో నరసయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు తదితరులు డిమాండ్ చేశారు.

మురళీనాయక్ వీర మరణం గర్వకారణం

చీడికాడ, మే 11(ఆంధ్రజ్యోతి): దేశం కోసం మురళీనాయక్ వీర మరణం పొందడం గర్వకారణం, నాయక్ తీరని లోటని రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు అన్నారు. మండలంలో దండిసురవరం గ్రామంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు ఆధ్వర్యంలో మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుతో పాటు పలువురు టీడీపీ నాయకులతో సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాకిస్థాన్‌తో యుద్ధం చేసే సమయంలో దేశ రక్షణ కోసం శక్తివంచన లేకుండా పోరాటం చేసి ప్రాణాలు విడవడం బాధాకరమైనా, ఆయన చేసిన ప్రాణ త్యాగం ఎన్నటికీ మరువలేరన్నారు. వీరమరణం పొందిన మురళీనాయక్‌ని కన్న తల్లిదండ్రులకు దేశ ప్రజలంతా వందనాలు తెలుపుతున్నారన్నారు. కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకులు గండి మునలినాయుడు, రెడ్డి సత్యంనాయుడు, పంచాడ దాలెంనాయుడు, రెడ్డి రాము, బీళ్ల కోటేశ్వరరావు, దారపు పెద్దినాయుడు, వంటాకు సూర్యనారాయణ, శ్రీరామ్మూర్తి, దారబోయిన చెల్లయ్య పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న బత్తుల

వేంకటేశ్వరస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ

చోడవరం, మే 11 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ వేడుకల్లో భాగంగా ఆదివారం భక్తుల ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం పండిత సత్కారం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీమాన్ శేష రామగోపాలాచార్యులు, గుంటూరు శాంతారామాచార్యులు, శ్రీనివాసు, మహిళా భక్త మండలి సభ్యులతో పాటు ఆలయ ప్రోత్సాహకులు ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, పనసారెడ్డి, చావలి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నాయకులు, భక్తులు

చురుగ్గా రిజర్వాయర్ గేట్ల మరమ్మతులు



రావణాపల్లి రిజర్వాయర్ గేట్లు మరమ్మతులు

గొలుగొండ , మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్ గేట్ల మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. నర్సీపట్నం, గొలుగొండ మండలాలకు సుమారు మూడు వేల ఎకరాలకు రిజర్వాయర్ సాగునీరు అందిస్తున్నది. దీంతో గేటు నుంచి నీటి నిల్వలు లీకేజీల మరమ్మతులు చేపట్టాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి స్థానిక రైతులు తీసుకు వెళ్లారు. దీంతో గేటు మరమ్మతులకుగాను మూడు లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో ఆదివారం గేటు మరమ్మతులు పనులు ప్రారంభించారు. దీనిపై ఇరిగేషన్ జేఈ రుత్తల రామన్నపాత్రుడు, మాజీ సర్పంచ్ కొల్లు సత్యనారాయణ ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఏఎంసీ చైర్మన్ పుప్పాలకు జన సైనికుల సత్కారం



అప్పలరాజును సన్మానిస్తున్న జన సైనికులు

మాడుగుల రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఏఎంసీ పుప్పాల అప్పలరాజుకు జన సైనికులు ఆదివారం సత్కరించారు. జనసేన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రటెడ్డి శివాజీ, దాసరి అచ్యుతరావు ఆధ్వర్యంలో అందరూ స్వగృహంలో కలుసుకున్నారు. శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలియజేశారు. మరన్ని ఉన్నత పదవులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు నాగరాజు, అశోక్, నానాజీ, కన్న, అబి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో మాతృ దినోత్సవం

నర్సీపట్నం, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం మాతృ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పిల్లలకు నీతి కథలు చెప్పారు. తల్లి గొప్పతనాన్ని వివరించారు. అమ్మను ఏ విధంగా సంతోషపరుస్తారో పిల్లలను అడిగి తెలుసుకున్నారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు వెలిచేటి అనంత ఉమశాంకర్ అబద్ధం ఆడటం వల్ల ఎంత ప్రమాదమో నీతి కథ రూపంలో తెలిపారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు పిజిల్స్, ఆంగ్ల అక్షరమాలతో ఆడించి ఉత్సాహపరిచారు.

కె.కోటపాడులో తల్లికి వందనం

కె.కోటపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ భవనంలో ఆదివారం తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు బిడ్డలతో పూలు చల్లించి పాదాభివందనాలు చేయించారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు భూపతి లక్ష్మి, డోకల కుమారి సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

వడ్డాదిలో వేసవి శిక్షణ శిబిరం

బుచ్చెయ్యపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో విద్యార్థులకు ఆదివారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. అమ్మ హెల్పింగ్ హార్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత వేసవి క్రీడా శిబిరాన్ని జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు ప్రారంభించారు. క్రీడల్లో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని దొండా రాంబాబు సూచించారు. ఈ నెల 25వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రతి రోజూ విద్యార్థులకు యోగా, తైక్వాండోతో పాటు పలు క్రీడల్లో శిక్షణ ఇస్తారని, ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకూ శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు దొండా నరేశ్, బీజేపీ మండల కార్యదర్శి దొండా నానాజీ, కోచ్‌లు పుల్లేటి సతీశ్, మురళీ, పీటర్ రాంబాబు, అమ్మ హెల్పింగ్ హార్ట్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మాకవరపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాకవరపాలెంలో అనారోగ్యంతో చనిపోయిన పింఛన్‌దారుడు కుటుంబానికి రామలక్ష్మణ్ పింఛనుదారు సంఘం ప్రధాన కార్యదర్శి పి.రంగరాజు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం గ్రామానికి చెందిన పైల తాతయ్యలు అనే పింఛన్‌దారుడు చనిపోయాడు. ఆయన కుమారుడికి సంఘం తరపు రూ.18 వేల నగదును అందజేసినట్టు ఈ సందర్భంగా రంగరాజు తెలిపారు. ఇటీవల చనిపోయిన వజ్రపు ఆనందరావు, డాకారు సత్యనారాయణలకు చెందిన కుటుంబ సభ్యులకు కూడా సంఘం తరపున సహాయం అందిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటరాజు, ఎం,శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

బుచ్చెయ్యపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో కేపీ.అగ్రహారం గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ రైతు నవధాన్యాలు వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారిని ఉత్తమ రైతులుగా దేవర తాతబాబు, స్కూల్ చైర్మన్ పినిశెట్టి మాణిక్యంలను సన్మానించారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ముసలినాయుడు, నాయకులు జి.నూకరాజు, సోమినాయుడు, తాతబాబు, పవన్, పాల్గొన్నారు.

చంద్రుపల్లి, లకున్‌పూర్ గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం


చంద్రుపల్లిలో బోరు తవ్వకం పనులు ప్రారంభిస్తున్న నాయకులు రాము, తదితరులు

సీలేరు, మే 11, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు పంచాయతీ పరిధిలోని చంద్రుపల్లి, లకున్‌పూర్ గ్రామాల్లో రూ. 6 లక్షలతో జల్‌జీవన్ మిషన్ సోలార్ వాటర్ ట్యాంక్ మంజూరైంది. ఇందులో భాగంగా ఆదివారం చంద్రుపల్లిలో బోరు తవ్వకం పనులకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్‌తో భూమి పూజ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమ గ్రామానికి తాగు నీటి సమస్య తీరనుండడంతో గ్రామస్థులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న తాగునీటి సమస్య పరిష్కారం కానుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలపై కూటమి నాయకులు ఆరాతీశారు. స్థానిక సర్పంచ్ పి దుర్గో, కూటమి నాయకులు చిటికెల రాము, వనముల రాము, ముంది, రమణ, కాశీ, పిలోస్, మారిబాబు, భగవాన్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమాచార్య జయంతి


అన్నమాచార్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న భక్తులు

జి.మాడుగుల, మే 11 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ పుణ్యక్షేత్రాలల్లో అన్ని చోట్లా హరినామ సంకీర్తనలు ప్రారంభించాలని అన్నమయ్య కళాశాల క్షేత్ర విశిష్ట ఆశ్రమ జిల్లా కన్వీనర్ వనగాల సత్యబాబు కోరారు. ఈ నెల 12న వాగ్గేయ కారుడు, వెంకటేశ్వరస్వామి భక్తుడు తాళ్లపాక అన్నమాచార్య 617వ జయంతిని ఆదివారం గడుతూరు పంచాయతీ రాళ్లపుట్టులో ఆయన ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు మత్స్యంనాయుడు, వీరన్నపడాల్, నాగభూషణం, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టాం రోడ్డుకు మరమ్మతులు

‘ఆంధ్రజ్యోతి’ కథనానికి స్పందన


పట్టాం రోడ్డు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

డుంబ్రిగుడ, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించుమండ సమీపంలోని ఒంటిపాక జంక్షన్ నుంచి పట్టాం వెళ్లే రోడ్డు మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకున్నారు.‘హైవేకు ఆనుకుని ఉన్న రోడ్డుకు మోక్షం కల్పించండి ’ శీర్షిక గత నెల 28 వతేదీన ప్రచురితమైన కథనానికి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. ఈ రోడ్డును మరమ్మతులు చేపట్టారు. ఈ మార్గంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు వాహనదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పెద్దగెడ్డ వంగసార ఆశ్రమంలో ప్రత్యేక పూజలు


కాశీ విశ్వేరునికి పుజలు చేస్తున్న అర్చకుడు

చింతపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్దగెడ్డ వంగసార కాశీవిశ్వనాథ క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని అర్చకుడు కృష్ణారావు త్రయోదశి, అష్టోత్తర శతనామావళి, రుద్రాభిషేకం, సకల దేవతా హోమం, వెంకటేశ్వర స్వామి కల్యాణం జరిపించారు.ఎల్‌ఐ మొట్టడం గంగరాజు, ఉపాధ్యాయురాలు లక్ష్మి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ బాలరాజు గ్రామ పెద్దలు సింహాచలం, లక్ష్మి చంటిబాబు, రామరాజు, నాగరాజు, చంద్రకళ పాల్గొన్నారు.

మోదకొండమ్మ తల్లీ.. కరుణించమ్మా..!

పాడేరులో అట్టహాసంగా ఉత్సవాలు ప్రారంభం

ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభయ్యాయి. ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్, జేసీ అభిషేక్‌గౌడ, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, మాజీ గిడ్డి ఈశ్వరి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. పట్టణంలో పండగ కళ సంతరించుకుంది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. విద్యుత్ దీపాల కాంతులు, సాంస్కృతి ప్రదర్శనలతో సందడి నెలకొంది.


పూజలందుకుంటున్న మోదకొండమ్మ


అమ్మవారి పాదాలు తలకెత్తుకున్న సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్


శతకంపట్టుకు ఘటాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు


రంపచోడవరం గిరిజనుల కొమ్ము నృత్య ప్రదర్శన


కాలేజీ గ్రౌండ్‌లో విద్యుద్దీపాలంకరణలో ప్లే జోన్

మాదక ద్రవ్యాలతో సమాజానికి చేటు

ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్, జేసీ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ

పాడేరు, మే 11(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలతో సమాజానికి తీవ్రమైన నష్టం కలుగుతుందని, ఎవరూ వాటి జోలికి పోద్దని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్, జేసీ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ అన్నారు. పాడేరులో మోదకొండమ్మ ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాళ్లను ఆయన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో ప్రారంభోత్సవం చేయించారు. వైద్యారోగ్య శాఖ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ముద్రించిన బ్యానర్‌ను ఆవిష్కరించి ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడారు. గంజాయి సాగు, వినియోగం చట్టవ్యతిరేకమని, వాటికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. అలాగే యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలజోలికి వెళ్లవద్దని హితవు పలికారు. అనంతరం వైద్యారోగ్య, కాఫీ, వెలుగు, జీసీసీ, సమాచారం శాఖ, ఐసీడీఎస్, వ్యవసాయ, ఉద్యానవనశాఖలు, ప్రకృతి వ్యసాయం, తదితర విభాగాలు ఏ ర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, డీఎంహెచ్‌వో సి.జమాల్‌బాషా, జిల్లా ఉద్యాన వన అధికారి రమేశ్‌కుమార్ రావు, మైక్రో ఇరిగేషన్ పీడీ రహీమ్, ప్రకృతి వ్యసాయం జిల్లా మేనేజర్ ఎల్.భాస్కరరావు, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు, డివిజనల్ పీఆర్‌వో పి.రాములు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మాదక ద్రవ్యాల వ్యతిరేక బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అభిషేక్‌గౌడ, గిడ్డి ఈశ్వరి, అధికారులు

గాలివాన బీభత్సం

పెదబయలులో విరిగిపడిన చెట్ల కొమ్మలు

ఒరిగిన విద్యుత్ స్తంభాలు.. నిలిచిన విద్యుత్ సరఫరా

పెదబయలు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి ఎండ కారెత్తించింది. సాయంత్రం నుంచి ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో భారీ వడగళ్ల వాన కురిసింది. దీంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రంలో పలుచోట్లచెట్టుకొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయా యి. విద్యుత్ తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లో తట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పిడుగుపాటుకు సీ కాలనీ వద్ద ఓ ఇంటిపై కప్పు రేకులు ధ్వంసమయ్యాయి. పాత మెడికల్ షాప్ వెనుక భాగంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక పలు గృహాల్లోకి వరదనీరు ప్రవేశించింది. రహదారులు జలమయ్యాయి. మట్టి రహదారులు దెబ్బతిన్నాయి.


పశు వైద్యశాల వద్ద ఒరిగిన విద్యుత్ స్తంభం


పెదబయలు కాలనీ రోడ్డుపై విరిగిపడిన చెట్టుకొమ్మలు

అంధకారంలో ముంచంగిపుట్టు

ముంచంగిపుట్టు: మండల పరిధిలో ఆదివారం సాయంత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ గాలీ, వర్షానికి గుత్తులపుట్టు, పెదబయలు మార్గం మధ్యలో విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో వైర్లు తెగిపోయాయి. దీంతో సాయంత్రం నాలుగు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయి మండల ప్రజలు పలు ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో విలవిల్లారు. దీనికితోడు సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా లేక అవస్థలు పడ్డారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రం వచ్చిన పలు గ్రామాల గిరిజనులు ఇంటర్ నెట్, జిరాక్స్, ఫొటో స్టూడియో, తదితర షాప్‌లు మూతపడ్డాయి. అయితే విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు. అయినా, రాత్రి 9 గంటల దాటినా విద్యుత్ రాలేదు.

‘గురుకులం, ఈఎంఆర్ కళాశాలల్లో ప్రవేశాల గడువు పెంచాలి’

గూడెంకొత్తవీధి, మే 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ గురుకుల జూనియర్ కళాశాల, ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువు పెంచాలని టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కలి రమేశ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఏజెన్సీ వ్యాప్తంగా పదోతరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం భారీగా పడిపోయిందన్నారు. పది ఫెయిలైన విద్యార్థులు ఈనెల 18 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నారన్నారు. అయితే, గురుకులం కళాశాలలకు ఈనెల 18, ఈఎంఆర్ విద్యాలయాలకు 30తో ప్రవేశాల గడువు ముగిసిపోతుందన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులు సైతం గురుకులం, ఈఎంఆర్ కళాశాల్లో ప్రవేశాలు పొందేందుకు అనువుగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మోదకొండమ్మ ఉత్సవాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్

పాడేరురూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): పాడేరులో ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మోదకొండమ్మ తల్లి ఉత్సవాల నేపథ్యంలో పట్టణ ప్రజలకు ఎటువంటి విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు 7 నెలకొల్పినట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జీవీఎస్.ప్రసాద్ తెలిపారు. ఈ ట్రాన్స్‌పార్మర్లను మోదమాంబ కాలనీ, పీఎంఆర్సీ, ఆర్‌హెచ్.కాలనీ, లోచలిపుట్టు, ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రాంతం (సుంద్రుపుట్టు), సుంద్రుపుట్టు రామాలయం వీధి, గోల్డెన్ నగర్ మెడికల్ కళాశాల ఏరియాల్లో ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా తమ సిబ్బంది 24 గంటలు విధులను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు డివిజన్ ఈఈ ఏవీఎస్ఎం అప్పారావు, ఎలక్ట్రికల్ సబ్‌డివిజన్ డిప్యూటీ ఈఈ కె.ఆనంద్‌మురళి, పాడేరు సెక్షన్ ఏఈ ఎం.వెంకటరమణ, జేఈ శ్రీనివాస్, లైన్‌ఇన్‌స్పెక్టర్ సీహెచ్.త్రిమూర్తులు, హెడ్ క్వార్టర్ లైన్‌మన్ సీహెచ్.కొండలరావు పాల్గొన్నారు.

రోజుకు 2 లక్షల లీటర్ల తాగునీరు సరఫరా: ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు

మోదకొండమ్మ జాతర పురస్కరించుకుని పట్టణంలో భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా తాగునీరు, వ్యక్తిగత మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్టు గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఈఈ కె.జవహర్ కుమార్ తెలిపారు. జాతర నేపథ్యంలో


భక్తులకు తాగునీటిని అందిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్ గౌడ

పట్టణంలోని మెయిన్ రోడ్డులో 10 చోట్ల మంచినీటి సరఫరా స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. 7 చోట్ల స్త్రీలకు, పురుషులకు వేర్వేరుగా మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు 10 ట్యాంకర్ల ద్వారా రోజుకు 2 లక్షల లీటర్ల నీటిని పురవీధుల్లో సరఫరా చేస్తున్నట్టు వివరించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా స్టాల్‌ను సందర్శించిన ఐటీడీఏ పీవో డాక్టర్.ఎంజే.అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ తదితరులు భక్తులకు నీటి సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు, అనంతగిరి, పెదబయలు, చింతపల్లి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలు, 11 మండలాల జేఈఈలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.


కొత్తగా వేసిన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌లను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రసాద్

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

ఉత్సవాల్లో పారిశుధ్యం కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు డీపీవో బి.లవరాజు, డీఎల్‌పీవో పీఎస్. కుమార్ తెలిపారు. పండగ మూడు రోజులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి పర్యవేక్షణలో పట్టణాన్ని 10 క్లస్టర్లుగా విభజించామన్నారు. రోజుకు 200 మంది కార్మికులు పారిశుధ్యం పనులు చేపట్టేలా చర్యలు చేపట్టామన్నారు. 11 ట్రాక్టర్లను వినియోగిస్తున్నామని వివరించారు. అనకాపల్లి జిల్లా నుంచి 38 మంది పారిశుధ్య కార్మికులను తీసుకువచ్చామన్నారు. ప్రతీ క్లస్టర్‌కు 10 మంది పారిశుధ్య కార్మికులు, నలుగురు పంచాయతీ కార్యదర్శులను నియమించామన్నారు. వీరిపై పర్యవేక్షణ బాధ్యతను ఈవో పీఆర్ అండ్ ఆర్డీ రమేశ్‌కు అప్పగించామన్నారు. వచ్చిన కార్మికులకు, పంచాయతీ కార్యదర్శులకు భోజన, వసతి సౌకర్యాలను పంచాయతీ సర్పంచ్ ఉషారాణి ఏర్పాటు చేశారన్నారు. సమస్యలుంటే ప్రజలు తెలిసేందుకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

మోదకొండమ్మ సన్నిధిలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్

పాడేరు, మే 11(ఆంధ్రజ్యోతి): స్థానిక మోదకొండమ్మను ఆదివారం రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా గర్భాలయంలో అమ్మవారికి ఆయన, సతీమణి సత్యవతి, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ నేత చింతు శ్రీను దంపతులు పాల్గొన్నారు.


మోదకొండమ్మకు పూజల్లో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ దంపతులు

రోగులకు సకాలంలో వైద్యమందించాలి: ఎమ్మెల్యే మత్స్యలింగం


ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ముంచంగిపుట్టు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక సీహెచ్‌సీని ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మందుల గదిని, సీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ గొబ్బిరిపడ గ్రామానికి చెందిన ఐదుగురు చిన్నారులు చర్మవ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. ఆసుపత్రిలో సమస్యలను వైద్యాధికారి గీతాంజలిని అడిగి తెలుసుకున్నారు. మందులు, వైద్య సిబ్బంది కొరత ఉందని ఆమె ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు జగబంధు, పద్మారావు, రామ్‌ప్రసాద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

తూకంలో మోసం

... 5వ పేజీ తరువాయి

తూనిక యంత్రం డిస్‌ప్లే మీద బరువు చూసుకుని డబ్బులు ఇస్తుంటారు. వ్యాపారి లీటర్ మోడ్‌లో తూకం వేసి, కిలోల బరువు కింద కొనుగోలుదారుల నుంచి డబ్బులు తీసుకుంటున్నాడు. ఒక లీటరుకి 910 గ్రాములు వస్తుంది. కిలోకి 1,000 గ్రాములు. లీటర్ మోడ్‌లో తూకం వేసి ఇవ్వడం వల్ల కొనుగోలుదారుడు 90 గ్రాములు నష్ట పోతున్నాడు. మరికొందరు వ్యాపారులు కిలోకు 100 నుంచి 150 గ్రాములు తూకం తక్కువ వచ్చే విధంగా మిషన్‌లో సెట్టింగ్స్ మార్చుకుంటున్నట్టు లీగల్ మెట్రాలజీ అధికారులు గమనించారు. ఎలమంచిలిలో ఈ విధమైన మోసాలకు పాల్పడుతున్న మాంసం దుకాణాలపై లీగల్ మెట్రాలజీ అధికారులు కేసులు రాశారు.

కొనుగోలుదారులు ఏం చేయాలంటే..

- ఎక్ట్రానిక్ తూనిక యంత్రం మీద సరకులు తూకం వేసే ముందు లీటర్ (ఎల్) మోడ్‌లో ఉందేమో గమనించాలి. లీటర్ మోడ్‌లో ఉంటే మోడ్ బటన్ నొక్కమని వ్యాపారిని అడగాలి.
- ఎలక్ట్రానిక్ కాటా మీద బేసిన్ లేదా ట్రే పెట్టిన తర్వాత టేర్ బటన్ నొక్కి సున్నా చూపించమని అడగాలి.
- ఎలక్ట్రానిక్ కాటా మీద అనుమానం వస్తే... లీగల్ మెట్రాలజీ అధికారులు ముద్ర వేసిన తూకం రాయితో బరువు చూపించమని అడగాలి.
- తూనిక యంత్రానికి లీగల్ మెట్రాలజీ అధికారులు ముద్ర వేసిన వైర్ కట్టి ఉందో లేదో చూడాలి
- కేంద్ర ప్రభుత్వం (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) ఆమోదించిన ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలు మాత్రమే వాడాలి. చైనా తూనిక యంత్రాల వినియోగం నిషేధం.

పోటాపోటీగా కబ్జాలు

... 5వ పేజీ తరువాయి

మెయిన్ రోడ్డు విస్తరణ గురించి ఒక్కసారి కూడా ప్రకటన చేయలేదు. దీంతో కబ్జాదారులు మరింత రెచ్చిపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి గతంలో బడ్డీలు ఏర్పాటు చేసిన వారు.. వాటిస్థానంలో ఇనుప రేకులతో పక్కాషెడ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. స్థానిక డీసీసీబీ బ్రాంచి సమీపంలో కొత్తగా షాపు నిర్మించిన యజమాని.. ఎదురుగా పది అడుగలు మేర రోడ్డును ఆక్రమించి షెడ్డు నిర్మించారు. అంతేకాక పైఅంతస్థుకు ఐరన్ మెట్లను ఏర్పాటుచేశారు. పాయకరావుపేట మెయిన్ రోడ్డులో ఆక్రమణలపై ఆర్‌అండ్‌బీ ఏఈ జ్ఞానేశ్వరరావును ‘ఆంధ్రజ్యోతి’ వివరణ కోరగా.. గతంలో ఈ రోడ్డును అభివృద్ధి చేయడానికి వీఎంఆర్‌డీఏకు బదలాయించారని, ప్రస్తుతం తమ ఆధీనంలో లేదని చెప్పారు.

ప్లాస్టిక్ భూతం

... 5వ పేజీ తరువాయి

పేరుతో ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నా.. ప్రజల్లో మార్పు కనిపించడం లేదని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లతో పేరుకుపోయి మురుగునీరు పారడంలేదు.

పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగం

ప్లాస్టిక్ వ్యర్థాలు నివాస ప్రాంతాల్లోనే కాకుండా ఖాళీ స్థలాలు, పంట పొలాలు, సాగునీటి చెరువుల్లో కూడా పేరుకుపోతున్నాయి. పరవాడ పెదచెరువుకు ఆనుకొని ఉన్న పైడిమాంబ బంధ, కోనాం, తానాంలోని బంధ, పరవాడ ఎర్రకోనాం తదితర చెరువులు ప్లాస్టిక్ వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వల్ల వాటిల్లోని నీటితోపాటు భూగర్భ జలాలు విషపూరితం అవుతున్నాయి. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోతున్నది. శుభకార్యాలు జరిగితే తాగునీటి నుంచి భోజనాల వరకు అన్నింటికీ ప్లాస్టిక్ వస్తువులే వాడుతున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ పేపర్ ప్లేట్లు ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. రహదారులపై చెత్తను తొలగించే పారిశుధ్య కార్మికులు డ్రైనేజీల కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడంలేదు. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు.

ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలను అరికడతాం

- కె.ధర్మారావు, పంచాయతీ విస్తరణాధికారి

దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలను అరికడతాం. వీటి వినియోగం వల్ల కలిగే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇళ్లలో వినియోగించే ప్లాస్టిక్ వ్యర్థాలను మురుగు కాలువల్లో వేస్తే చర్యలు తీసుకుంటాం. ప్లాస్టిక్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. ప్లాస్టిక్ వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలి.

పెళ్లింట విషాదం

... 5వ పేజీ తరువాయి

ఈనెల 8వ తేదీ రాత్రి గిరిజన సంప్రదాయాలతో వివాహం జరిగింది. మరుసటి రోజు శుక్రవారం అన్నవరం సత్యదేవుని సన్నిధిలో వ్రతం చేయించుకుని, దైవ దర్శనం చేసుకున్నారు. అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి చేరుకున్నారు. జగదీశ్ తన స్నేహితులకు పెళ్లి పార్టీ ఇచ్చేందుకు శనివారం మధ్యాహ్నం ఐదుగురు స్నేహితులతో కలిసి కొత్త కొట్నాబిల్లి వద్ద ఉన్న ఒక క్వారీ వద్దకు వెళ్లారు. పూటుగా మద్యం సేవించిన తరువాత జగదీశ్ సమీపంలో వున్న నీటి కుంటలో ఈత కొట్టడానికి వెళ్లాడు(క్వారీలో రాయి తవ్వకాల వల్ల ఇక్కడ భారీ గొయ్యి ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది). కానీ లోతు ఎక్కువగా వుండడంతో నీటిలో మునిగిపోయాడు. దూరంగా వున్న స్నేహితులు ఈ విషయాన్ని గమనించలేదు. జగదీశ్ తమకు చెప్పకుండా ఇంటికి వెళ్లిపోయి వుంటాడని భావించి ఊళ్లోకి వెళ్లిపోయారు. చీకటి పడినా జగదీశ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, అతని స్నేహితులను వాకబు చేశారు. క్వారీ వద్ద మద్యం సేవించామని, తమకన్నాముందే జగదీశ్ వచ్చేశాడని చెప్పడంతో అక్కడకు వెళ్లి వెతికారు. కానీ ఆచూకీ లభించలేదు. సమీప గ్రామాల్లో వున్న బంధువులను ఆరా తీసినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు మొదలుపెట్టారు. మధ్యాహ్నం తరువాత క్వారీ గొయ్యిలో జగదీశ్ శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు క్వారీ వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. జగదీశ్ తండ్రి ఆసరి సీతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపారు.


బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రోజంతా వస్తూనే..ఉన్నారు

- నూకాంబిక ఆలయంలో భక్తజన సందడి
- జాతర ముగిసినా కొనసాగుతున్న కోలాహలం


మేయర్‌కు చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో, ఉత్సవ కమిటీ మాజీ సభ్యుల

అనకాపల్లి టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామున అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచి భక్తుల రాక ఆరంభం కావడంతో ఆలయానికి వచ్చే రహదారులు సందడిగా మారాయి. వివాహాలు జరిగిన ఇళ్లవారు మొక్కుబడుల్లో భాగంగా అమ్మవారి పండుగలను జరుపుకోవడంతో మరింత కోలాహల వాతావరణం నెలకొంది. కొత్త అమావాస్య జాతర ముగిసి రెండు వారాలు అయినప్పటికీ ఆలయానికి భక్తుల తాకిడి తగ్గలేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కుటుంబాల సమేతంగా తరలివచ్చి దర్శించుకున్నారు. బాలాలయంతో పాటు క్యూలైన్లు నిండిపోయాయి. సాయంత్రం ఐదు గంటలు దాటినా భక్తుల తాకిడి కొనసాగుతూనే ఉంది. ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇదిలావుంటే, నూకాంబిక అమ్మవారిని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మేయర్‌గా ఎన్నికైన అనంతరం తొలిసారిగా ఆలయానికి వచ్చిన ఆయనకు ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను ఘన స్వాగతం పలికారు. అనంతరం బాలాలయంలోని అమ్మవారికి మేయర్ దంపతులు పూజలు నిర్వహించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కొణతాల భాస్కరరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్లు వేగి పరమేష్, బొడ్డేడ శ్రీను, విల్లూరి హరి, ఉత్సవ కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

బయ్యవరంలో ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

- ఐదు మోటారు సైకిళ్లు, రూ.28,040ల నగదు స్వాధీనం

కశింకోట, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం సమీపంలో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేసి, ఆరుగుర్ని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిసిన వివరాలివి. గ్రామం వద్ద గల మామిడితోటలో పేకాట ఆడుతున్నారని ముందుగా సమాచారం అందిందన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి దాడి చేసి ఆరుగుర్ని అదుపులోకి తీసుకుని, ఐదుమోటారు సైకిళ్లు, రూ.28,040 నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు చెప్పారు.

మహిళలకు సత్యసాయి ట్రస్టు కుట్టు మిషన్లు పంపిణీ


కుట్టు మిషన్లు పొందిన మహిళలతో సత్యసాయి సంస్థల ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా గల సత్యసాయి మందిరంలో ఆదివారం పలువురికి కుట్టుమిషన్లు, రైతులకు ఉపయోగపడే పరికరాలను పంపిణీ చేశారు. ఈశ్వరాంబ డే సందర్భంగా పుట్టపర్తిలోని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు పంపించిన ఆరు కుట్టుమిషన్లు, రెండు జ్యూట్ బ్యాగ్స్ కుట్టే మిషన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే దివ్యాంగులకు ఆరు వీల్‌చైర్లు, పొలాలకు వాడే ఏడు స్ప్రేయర్లు రైతులకు జిల్లా సత్యసాయి సంస్థల అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నం రాజశేఖర్, కామరాజు, సుబ్రహ్మణ్యం, కన్నూరు అప్పలనాయుడు, భారతి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్‌బ్రేకర్లకు రంగులు వేయాలని వినతి

పరవాడ, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ పాఠశాల, బొంకులదిబ్బ వీధి సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయాలని స్థానికులు కోరుతున్నారు. రంగులు లేకపోవడం వల్ల ఇటీవల కాలంలో ఇక్కడ ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వేగంగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు వీటిని గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కాలంలో ఈ సంఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి స్పీడ్‌బ్రేకర్లకు రంగులు వేసేందుకు చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

వారాంతపు రోజున ఊరంతా చెత్తే..!

▸ రెండేళ్లుగా ప్రతి ఆదివారం అనకాపల్లిలో ఇదే దుస్థితి ▸ పారిశుధ్య సిబ్బందికి సెలవు దినం కావడంతో సమస్య ▸ రొటేషన్ పద్ధతిని పాటిస్తే పరిస్థితి మెరుగుపడుతుందని పలువురు సూచన


ఉడ్‌పేట కాలువలో మురుగు తిష్ట


కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డుపై ఉన్న కుళ్లిన పదార్థాలు


వేల్పులవీధి కాలువలో...

అనకాపల్లి టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : కాలువల్లో మురుగు కదలదు.. వీధుల్లో చెత్త వదలదు.. ఇవీ ఆదివారం వస్తే జిల్లా కేంద్రం అనకాపల్లిలో కనిపించే దృశ్యాలు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పారిశుధ్య కార్మికులకు కూడా ఆదివారం రోజు సెలవు కావడంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని పలువురు వాపోతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి, ఇప్పటి మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ ఆనాడు అనకాపల్లిని సందర్శించారు. కూరగాయల మార్కెట్‌ను పరిశీలించగా మార్కెట్ ఆవరణ అంతా దుర్గంధంగా మారి ఉండడంతో అధికారులను ప్రశ్నించారు. కార్మికులు సెలవు కారణంగా పనులు చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని వివరించారు. దీంతో కార్మికులకు ఆదివారం సెలవు బదులు రొటేషన్ పద్ధతిని పాటించాలని మంత్రి ఆదేశించారు. మిగతా రోజుల్లో సెలవు ఇచ్చి ఆదివారం కూడా పనులు చేయించి పట్టణ పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో అప్పటి నుంచి కార్మికులకు రొటేషన్ పద్ధతిలో ఆదివారానికి బదులు మిగతా రోజుల్లో సెలవు ఇచ్చి పారిశుధ్య పనులను అధికారులు చేయించేవారు. అయితే గత ప్రభుత్వ హయాంలో కార్మిక సంఘాల డిమాండ్ మేరకు కార్మికులకు ఆదివారం సెలవు మంజూరు చేస్తున్నారు. ఈ కారణంగా ఆదివారం వస్తే అనకాపల్లిలో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోతోంది. కాలువలు కూడా పరిశుభ్రతకు నోచుకోవడం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగానే ఇప్పుడు కూడా కార్మిక సంఘాలతో మాట్లాడి ఆదివారం కూడా కార్మికులతో పనులు చేయిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇదిలావుంటే, జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో 200 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. రోజూ పట్టణంలో 80 నుంచి 90 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. ఈ చెత్తనంతటినీ కార్మికులు తెల్లవారుజాము నుంచి వీధుల్లో తిరిగి సేకరించి జీవీఎంసీ కార్యాలయ ఆవరణలోని పోగు చేస్తుంటారు. అలా పోగు చేసిన చెత్తను భారీ వాహనాల ద్వారా విశాఖనగర పరిధిలోని కాపులుప్పాడ కంపోస్టు యార్డుకు తరలిస్తుంటారు. రోజులో కనీసం 20 టన్నుల చెత్త అయినా కార్యాలయం ఆవరణలో నిల్వ ఉంటుంది. ఆదివారం చెత్తకుప్పలు పేరుకుపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే పాదచారులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పల్లెవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల చెత్త తడిసి కుళ్లిపోతుండడంతో దుర్వాసనను భరించలేకపోతున్నామని పలువురు వాపోతున్నారు.

ముఖ్యంగా కూరగాయల మార్కెట్ వద్ద పరిస్థితి దారుణంగా ఉంటోంది. కూరగాయల వర్తకులు కుళ్లిపోయిన కూరగాయలను పోగులుగా వేయడం వల్ల భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. కన్యకాపరమేశ్వరీ ఆలయం, శాఖవీధి జంక్షన్, నరసింగరావుపేట తదితర ప్రాంతాల్లో చెత్తతో పాటు చెట్టుకొమ్మలు కూడా పడేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాలువల్లో సైతం మురుగు పేరుకుపోతోంది. దీనివల్ల దోమలు వృద్ధిచెంది రాత్రివేళల్లో సరిగా నిద్ర ఉండడం లేదని అంటున్నారు. ప్రభుత్వం ఇక్కడి సమస్యలను గుర్తించి కార్మికులకు రొటేషన్ పద్ధతిలో సెలవులు మంజూరు చేసి, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

ఈ సమస్యను జీవీఎంసీ అనకాపల్లి జోన్ శానిటరీ సూపర్‌వైజర్ రవికుమార్ వద్ద ప్రస్తావించగా, కార్మికులకు ఆదివారం సెలవు కావడంతో ఈ పరిస్థితి నెలకొంటుందన్నారు. సోమవారం పట్టణంలో చెత్తనంతటినీ సేకరించి కంపోస్టు యార్డుకు తరలిస్తామని, డ్రైనేజీలను శుభ్రం చేయిస్తామని వివరించారు.


కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద రోడ్డుపై...



నరసింగరావుపేట స్కూల్ వద్ద...

టీడీపీలో కష్టపడే వారికి గుర్తింపు : బాబ్జీ


టీడీపీ మండల కమిటీ సభ్యుల సత్కారంలో గండి బాబ్జీ, తదితరులు

సబ్బవరం, మే 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. గొటివాడలో ఆదివారం నిర్వహించిన మండల కమిటీ ఎన్నికలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. గ్రామ గ్రామాన పార్టీని మరింత బలోపేతం చేయడమే అందరి లక్ష్యం కావాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా అమృతపురానికి చెందిన గండి ముత్యాల నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కొరాడ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా సాలాపు సూరిబాబు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గండి దేముడు, కుచ్చర్లపాటి రామకృష్ణరాజు, అమరపిన్ని నర్సింగరావు, కార్యదర్శిగా నొట్ల శ్రీను, మొల్లి కనకరాజు, ఆడారి నాగరాజు, కోశాధికారి రెడ్డి దేముడు, బలిరెడ్డి కనకరాజు, పైల రమణ ఎన్నికయ్యారు. అలాగే, మలునాయుడుపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సింగంపల్లి ఎర్నికుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండి వంశీ దీప్, పీబీవీఎస్ఎన్ రాజు, భరణికాన బాబూరావు, గండి దేముడు, ముత్యాల నాయుడు, బొండా సత్యారావు, దాసరి రమణ, రామకృష్ణరాజు, పల్ల తాతారావు, ఆడారి నాగరాజు, కొరాడ శ్రీనివాసరావు, గొర్లి సత్తిబాబు, దాడి కన్నంనాయుడులతో పాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పరవాడ : రావాడ టీడీపీ గ్రామ కమిటీ కార్యవర్గం ఏర్పాటైంది. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సారిపల్లి జోగినాయుడు సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా కోన కృష్ణ, ఉపాధ్యక్షుడిగా సీరా సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శిగా పులిమంతులు అప్పలరాజు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పైలా రామకృష్ణ, షేక్ ఖలీల్, పోలవరపు సంతోష్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా మోటూరు విజయ్, పాతరపల్లి రమణ, మామిడి మురళీకృష్ణ, కోశాధికారులుగా మోటూరు సూరిబాబు, కూండ్రపు అప్పలనాయుడు, గుర్రం రాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సాలాపు వెంకటరమణ, మరిసా అప్పలరాజు, మొల్లి గంగాధర్, వియ్యపు సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

84వ డివిజన్ టీడీపీ సాంస్థగత ఎన్నికలు

తుమ్మపాల : టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు 84వ డివిజన్‌లో ఆదివారం సంస్థాగత ఎన్నికలను డివిజన్ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో చేపడుతున్న అభివృ, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం పదకొండు మంది సభ్యులతో ప్రమాణం చేయించారు. బొలిశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిరసపల్లి సన్యాసిరావు, కుప్పిలి జగన్, వెంకట్రావు, బోయిన మురళి, తలారి ప్రసాద్, పాపారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన 84వ వార్డు టీడీపీ నాయకులు

'లేబర్ కోడ్‌లను కేంద్రం రద్దు చేయకుంటే పోరు ఉధృతం'



రహదారిపై నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

తుమ్మపాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులతో కలిసి ఆదివారం ఇక్కడి జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్ లను తక్షణమే రద్దుచేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వియ్యపు రాజు, డి.అనిల్‌రాజు, బి.శ్రీను, నరసింగరావు, అప్పలరాజు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఖోఖోలో శిక్షణ


ఖోఖో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కశింకోట, మే 11 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆదివారం ఖో-ఖోలో శిక్షణ ఇచ్చారు. ఈ క్రీడలో ఎటువంటి మెలకువలు పాటించాలో వివరించారు. అంతేకాక మ్యూజికల్ ఛైర్ గేమ్ నిర్వహించారు. ఉదయం బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, గణితంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జగన్ మాట్లాడుతూ గ్రంథాలయాల సందర్శన ద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చునన్నారు. అలాగే క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసంగా పొందవచ్చన్నారు.

సైనికులకు సంఘీభావంగా ర్యాలీ



రేబాక ప్రధాన జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

అనకాపల్లి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలకు తెగించి పోరాడుతున్న దేశ సైనికులకు సంఘీభావంగా రేబాక గ్రామస్థులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన జంక్షన్ నుంచి జైహింద్ ఆపరేషన్ సిందూర్, జోహార్ మురళీనాయక్ అంటూ నినాదాలు చేస్తూ జాతీయ జెండాలు చేతబట్టి అంతా ముందుకు సాగారు. దేశం కోసం పోరాడి అతి చిన్న వయస్సులోనే వీర మరణం పొందిన మురళీనాయక్‌కు నివాళులర్పించారు. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దేశ పౌరులంతా భారత సైనికులకు సంఘాభావంగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరణం మాణిక్యాలరావు, రిటైర్డు ఆర్మీ సైనికుడు ఎం.భాస్కరరావు, కోట సంతోష్, పచ్చికూర గాంధీ, కరణం నాయుడు, కోన నాయుడు, యువకులు పాల్గొన్నారు.

లంకెలపాలెంలో వాలీబాల్ పోటీలు ప్రారంభం

లంకెలపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెంలో మరిమాంబ ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. క్రీడల్లో యువత రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ దిశగా కృషి చేయాల్సిందిగా సూచించారు. మూడు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రౌతు రామచంద్రరరావు, రౌతు నాగేశ్వరరావు, మోటూరి నాగేశ్వరరావు, సుందరపు శ్రీను, రౌతు మూర్తి, శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

ఉత్తమ విద్యార్థులకు ఘన సత్కారం


సత్కారం పొందిన విద్యార్థులతో కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం ఆదివారం ఇక్కడ ఘనంగా సత్కరించింది. సంఘం అధ్యక్షులు రెడ్డి వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పన సుబ్రహ్మణ్యం ఆర్థిక సహాయంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన సోదరుడు కాశీ శంకరబాబు, కాలేపు తాతాజీ, సాంబమూర్తి, రెడ్డి నారాయణరావు, చక్రవర్తి, బాలగురూజీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి లక్షణాలపై పూర్తి అవగాహన అవసరం

- సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘు సమావేశంలో వక్తలు

కొత్తూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : వ్యాధి లక్షణాలపై గ్రామీణ వైద్యులంతా పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే సమయానికి తగిన వైద్యం అందించగలరని ప్రముఖ వైద్యులు ఆర్.పవన్‌కుమార్, కె.తిరుపతిరావు, టి.సురేష్‌బాబు అన్నారు. ఆదివారం అనకాపల్లిలో సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హార్ట్ ఎటాక్, ఫిట్స్, గ్యాస్ట్రిక్ తదితర వ్యాధుల లక్షణాలపై గ్రామీణ వైద్యులకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలను ప్రాథమికంగా గుర్తించి తగిన చికిత్స రోగికి అందిస్తే యాభై శాతం మరణాలను తగ్గించవచ్చునన్నారు. అనంతరం మెరుగైన వైద్యానికి రోగిని ఆసుపత్రికి పంపితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

ఫిట్స్‌లో రెండు రకాలున్నాయని వాటిలో ఒకటి నరాల బలహీనత వల్ల వచ్చేది, రెండోది సాధారణంగా వచ్చేదిగా పేర్కొన్నారు. వాటిని సకాలంలో గుర్తించి దేని ద్వారా వచ్చిందో గుర్తించి తగిన చికిత్సలను అందించాలని సూచించారు. ఇటీవల సకాలంలో గ్యాస్ట్రిక్ సమస్యను హార్ట్ ఎటాక్ వచ్చినట్టుగా భావించి పలువురు ఆందోళన చెందుతున్నారన్నారు. అటువంటి వారు వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. వేదశ్రీ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, అల్లాడ త్రినాథ్, జోనల్ కార్యదర్శి గద్దె చిరంజీవి, విశాఖపట్నం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, అనకాపల్లి ఆర్ఎంపీ వైద్యుల సంఘం ప్రతినిధులు అల్లక రాజు, కె.వీరభద్రరావు, వై.వి.రమణాజీ, మారోజు సత్యనారాయణ, రమణారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుడు కేశిరెడ్డి తిరుపతి